సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 4 । జూన్ । 2024



బీజేపీదే విజయం
నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రెండోసారి బీజేపీ గెలుస్తుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు.
- 8లో ▸



కొల్‌పూర్ టూ బద్రీనాథ్
నందిపేట్ మండలం కొల్‌పూర్ భూమయో గేశ్వర ఆశ్రమ సభ్యులు బద్రీనాథ్ క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
43.0 /26.5

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల ప్రతిపాదనలు పంపాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోని పాలకవర్గాల కాలపరిమితి ముగిసిన సహకార సంఘాలు ఎన్నికల కోసం ప్రతిపాదనలు పంపించాలని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పలు సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి ప్రతిపాదనలు పంపించామని, వాటికి ఈ నెల 6 నుంచి 28వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈలోపు ఏవైనా సహకార సంఘాల పాలకవర్గాల కాలపరిమితి ముగిసి ఉంటే వెంటనే ప్రతిపాదనలు డీసీవో కార్యాలయానికి పంపితే వాటికి కూడా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

పాలిసెట్‌లో ప్రతిభ

నిజామాబాద్ అర్బన్: పాలిసెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎంపీసీలో ఆలూరు మండలం గుత్ప గ్రామానికి చెందిన గంట ప్రగ్నేష్ (12వ ర్యాంక్), నిజామాబాద్‌లోని ముబారక్‌నగర్ లక్ష్మీప్రియనగర్‌కు చెందిన అంబాల అత్రిజ్ (60వ ర్యాంక్), పద్మానగర్‌కు చెందిన నాగుల సంకీర్తనరెడ్డి (216 ర్యాంక్)సాధించారు. ఎంబైపీసీ విభాగంలో గుత్ప గ్రామానికి చెందిన గంట ప్రగ్నేష్ (10వ ర్యాంక్), నిజామాబాద్‌లోని వినాయకనగర్‌కు చెందిన రాంగిరి సాయికృష్ణ (42వ ర్యాంక్), నగరానికి చెందిన ఈర్ల కౌశిక్ (228 ర్యాంక్) సాధించారు.

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో చదివిన గోత్రాల అక్షర పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో ఐదో ర్యాంకు సాధించింది. ఎంపీసీ విభాగంలో 120 మార్కులకుగాను 118 మార్కులు సాధించింది. ఆమె బైపీసీ విభాగంలో 31వ ర్యాంకు సొంతం చేసుకుంది.

సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన పైడి శ్రీహర్ష బైపీసీ విభాగంలో 22వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో 55వ ర్యాంకు, పెరుమల్ల గ్రామానికి చెందిన మాలోత్ శేషాద్రి బైపీసీ విభాగంలో 13వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో 75వ ర్యాంకు సాధించారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపు ఓటములపై జోరుగా బెట్టింగ్ సాగుతోంది. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కూడా జిల్లాలోని పందెం రాయుళ్లు పందెం కాస్తున్నారు. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి.. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారని రూ.లక్షల్లో బెట్టింగ్ పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు చాలామంది ఆన్‌లైన్‌లో పందెం కాస్తున్నారు.

మంచం పట్టిన హన్మాజీపేట్



బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండల కేంద్రానికి సుదూరంలో అటవీ ప్రాంతంలో ఉండే హన్మాజీపేట్‌లో ప్రతి ఇంట్లో కనీసం ఒకరిద్దరు జ్వరాలతో బాధ పడుతున్నారు. పక్షం రోజులుగా గ్రామంలో ప్రజలు తీవ్ర జ్వరం, కీళ్లనొప్పులు, ఒళ్లునొప్పులతో మంచాన పడి అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని పీఎంపీల వద్ద వైద్యం చేసుకుని, తగ్గకపోవడంతో బాన్సువాడకు పరుగులు పెడ్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు అందించినా ఎలాంటి ఫలితం దక్కలేదని గ్రామస్తులు వాపోతున్నారు. నాణ్యమైన వైద్యం అందకపోవడంతో జ్వరపీడితులు బాన్సువాడ, బోధన్, నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. గ్రామంలోని 1, 7, 8 వార్డుల్లో జ్వర బాధితులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. తామంత రక్తపరీక్షలు చేయించుకుంటే చికున్‌గున్యా ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని గ్రామస్తులు పేర్కొన్నారు. తీవ్ర నొప్పుల మూలంగా యువత కూడా గోడలు పట్టుకుని, కర్రల సాయంతో నడుస్తున్నారు. బాధితులను పరామర్శించడానికి వచ్చిన ఇతర గ్రామాల వారు కూడా జ్వరం బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్పెషలిస్ట్ వైద్యులతో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి నాణ్యమైన వైద్యం, ఉచితంగా మందులు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎవరో విజేత!

- నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- 21 రోజుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్
- కొన్ని గంటల్లో పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు
- డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మరూ
- ప్రధాన పార్టీల అభ్యర్థులు, శ్రేణుల్లో నరాలు తెగే ఉత్కంఠ





సీఎంసీలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై నేడు ఉత్కంఠకు తెరపడనుంది. హోరాహోరీగా సాగిన పోరులో బీజేపీ నుంచి అర్వింద్, కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి సీనియర్ నేత బాజిరెడ్డి గోవర్ధన్ పోటీ పడ్డారు. ఎన్నికల ఫలితాల కోసం ఏకంగా 21 రోజుల పాటు ఎదురుచూడాల్సి వచ్చింది. డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో ఉదయం 8 గంటలకు ఓట్ల కౌంటింగ్ ప్రారంభం కానుంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల ఫలితాల కోసం ఏకంగా 21 రోజుల పాటు ఎదురుచూడాల్సి వచ్చింది. ఉత్కంఠ, ఆసక్తి కలిగించే ఎన్నికల ఫలితాలు కావడంతో ఇది చాలా ఎక్కువ సమయం అంటూ అన్నివర్గాల వారు లెక్కలు వేసుకుంటూ గడిపారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు ఏడు విడతల్లో నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో నాలుగో విడతలో ఎన్నికలు జరిగాయి. దీంతో ఫలితాల కోసం దేశంలో వివిధ రాష్ట్రాల్లో మరో మూడు విడతల ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎదురు చూడాల్సి వచ్చింది. ఏకంగా మూడు వారాలు ఎదురు చూడాల్సి రావడంతో నరాలు తెగే ఉత్కంఠను కొందరు అనుభవించారు. ఇప్పుడు ఫలితాల ప్రకటనకు కొన్ని గంటలే ఉండడంతో చాలామంది గుండెలు లబ్‌డబ్ అంటూ కొట్టుకుంటున్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో ఉదయం 8 గంటలకు మొదలు కానుంది.

■ గత నెల 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. అప్పటి నుంచి ప్రతిఒక్కరూ ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తూ వచ్చారు. ఈ నెల 1న ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాక ఈ ఉత్కంఠ, ఆసక్తి మరింత పెరిగింది. అభ్యర్థులు, ఆయా పార్టీల కార్యకర్తలు లెక్కింపు కోసం ఎదురుచూస్తుండగా, సాధారణ ఓటర్లు సైతం చాలా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ, బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్‌అర్బన్ సెగ్మెంట్లకు సంబంధించి సీఎంసీ కళాశాలలో ఈ కౌంటింగ్ నడవనుంది.

■ నిజామాబాద్ పార్లమెంట్‌లో సిట్టింగ్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత తాటిపర్తి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత బాజిరెడ్డి గోవర్ధన్ మధ్య పోరు జరిగింది. సైలెంట్ ఓటింగ్ ద్వారా తాము గెలవనున్నట్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు. భారీ మెజారిటీతో గెలవనున్నట్లు బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. త్రిముఖ పోటీలో తనకు వచ్చే ఓట్ల విషయమై బాజిరెడ్డి లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు క్రాస్ ఓటింగ్ ఎవరికి కలిసొస్తుంది, ఎవరికి నష్టం జరుగుతుందన్న విషయమై గత 21 రోజులుగా మూడు పార్టీలు లెక్కలు వేసుకుంటూ వచ్చాయి. ఈ క్రమంలో ఆయా అభ్యర్థులతో పాటు కీలక నాయకులు, ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకుల సొంత ఊర్లలోని బూత్‌లలో సాధించే ఓట్ల విషయమై టెన్షన్ పడుతున్నారు. అర్ధరాత్రి వరకు ఫలితాల గురించే చర్చిస్తున్నారు.

■ రాష్ట్రంతో పాటు నిజామాబాద్ లోక్‌సభ ఫలితాలకు సంబంధించి కొంతమేర స్పష్టత ఉన్న నేపథ్యంలో తోటి తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో వెలువడనున్న శాసనసభ ఎన్నికల ఫలితాల విషయమై వివిధ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. పైగా ఏపీ ఫలితాలకు సంబంధించి జిల్లాలో బెట్టింగ్‌లకు పాల్పడుతుండడం పట్ల ఆసక్తి, ఉత్కంఠ ఏ మేరకు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

- 15 రౌండ్లలో కౌంటింగ్
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు. ఉదయం 5 గంటలకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి, ఆ జాబితాను అనుసరిస్తూ సిబ్బందిని కేటాయిస్తామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సిబ్బందిని అన్ని విధాలుగా సన్నద్ధం చేశామన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలు తెలిపేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, ఎలాంటి పొరపాట్లు, గందరగోళానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 7 కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశామని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం కూడా ప్రత్యేకంగా కౌంటింగ్ హాల్ నెలకొల్పామని తెలిపారు. 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు కౌంటింగ్ పూర్తయ్యే అవకాశముందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం 25 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 558 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించామని వివరించారు. వీరిలో 180 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 190 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 188 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారని వివరించారు. అభ్యర్థులు, వారి తరఫున ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ సెంటర్ వద్దకు రావాలని కలెక్టర్ సూచించారు. తాము జారీ చేసిన ఎంట్రీ పాసులతోపాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యాక ఏజెంట్ల మార్పునకు అవకాశం ఉండదన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కౌంటింగ్ కేంద్రం చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

డిచ్‌పల్లి: నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. డిచ్‌పల్లి సీఎంసీ కళాశాల కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం రాత్రి ఆయన సందర్శించారు. కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌ను సీఎంసీలోనే నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలు తెలిపేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, ఎలాంటి పొరపాట్లు, గందరగోళానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

రెండో ర్యాండమైజేషన్ పూర్తి

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం పూర్తిచేశారు. ఎన్నికల పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, లలిత్ కుమార్ సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్లతోపాటు పోస్టల్ బ్యాలెట్లను డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాలలో లెక్కించనున్నారు. ఆయా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సిబ్బందిని ఖరారు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఈ ప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్ ద్వారా చూపించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. మైక్రో అబ్జర్వర్లకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపుపై శిక్షణ తరగతులు సైతం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా నిర్వర్తించాల్సిన విధులు, పాటించాల్సిన నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించారు. సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఎన్ఐసీ అధికారి రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- కౌంటింగ్ సెంటర్‌కు ఐదు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్



సీఎంసీ వద్ద ఏజెంట్ల చెకింగ్ పాయింట్

డిచ్‌పల్లి/ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలోని మంగళవారం ఓట్ల లెక్కింపునకు వచ్చే వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు పక్కాగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

- ఏజెంట్లు నడిపల్లి చౌరస్తా నుంచి అమృతాపూర్ మీదుగా మాత్రమే కౌంటింగ్ కేంద్రానికి రావాలి. ఇతర మార్గాల్లో అనుమతించరు. (నిజామాబాద్ వైపు నుంచి వచ్చే వారు గొల్లపల్లి రోడ్-ఎంఎస్ఆర్ బార్ మీదుగా రావొచ్చు).
- సీఎంసీ సెంటర్ వద్ద మంగళవారం ఉదయం 6గంటలకు ఉండాలి.
- ఏజెంట్లకు జారీ చేసిన గుర్తింపు కార్డుపై, వారి ఫొటోను అతికించుకోవాలి. వారి వెంట ధృవీకరణకు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలి.
- ఏజెంట్ల ఫోన్‌లను కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించరు. కేంద్రం వద్ద ఫోన్‌లను డిపాజిట్ చేయడానికి ఎలాంటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు.
- సెంటర్‌లో, కౌంటింగ్ ఏజెంట్లందరికీ వివరాలు నమోదు చేసుకునేందుకు నోట్ ప్యాడ్, పెన్నులు అందిస్తారు.
- కేంద్రం లోపలికి ఎలక్ట్రానిక్ పరికరాలు, రికార్డింగ్ పరికరాలు, డిజిటల్ వాచీలు, సిగరెట్, బీడీ, అగ్గిపెట్టె, పదునైన వస్తువులు తీసుకెళ్లొద్దు.
- అధికారుల ప్రవేశ ద్వారం నుంచి అభ్యర్థులను, ఎన్నికల ఏజెంట్లను, టబ్యులేషన్ ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తారు.
- పోలింగ్ రోజు కోసం అభ్యర్థుల అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నామినేట్ చేసిన పోలింగ్ ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రం వద్దకు అనుమతించరు.
- అభ్యర్థులు, ఏజెంట్లు తమ వాహనాలను నిర్దేశించిన స్థలంలో మాత్రమే పార్కింగ్ చేయాలి.
- 44వ నంబరు జాతీయ రహదారి వైపు నుంచి, డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ రోడ్డు వైపు నుంచి కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించడానికి ఏజెంట్లను అనుమతించరు.
- కౌంటింగ్ ఏజెంట్‌కు బదులుగా మరొకరిని అనుమతించరు.
- ఆహారం, తాగునీరు తదితర సౌకర్యాలు కేంద్రం వద్ద అందుబాటులో ఉంటాయి.
- కౌంటింగ్ కేంద్రానికి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఎవరూ కూడా ప్రెస్ మీట్, ప్రెస్ బ్రీఫింగ్ నిర్వహించొద్దు.
- విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం, టపాసులు పేల్చడం, రాజకీయ నాయకులు/పార్టీ కార్యకర్తలు గుమిగూడడం వంటి చర్యలు సీఎంసీ కౌంటింగ్ సెంటర్‌కు ఐదు కిలోమీటర్ల పరిధిలో పూర్తిగా నిషేధం.
- సీఎంసీ నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

ఎస్సారెస్పీ సామర్థ్యం 80.5 టీఎంసీలే !

- ధ్రువీకరించిన ప్రాజెక్టు అధికారులు
- 2021–22లో సర్వే నిర్వహించిన సీకాన్ సంస్థ
- ప్రాజెక్టు నిర్మాణం నుంచి 32 టీఎంసీల మేర పేరుకుపోయిన పూడిక



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీల నుంచి 80.5 టీఎంసీలకు పడిపోయింది. రెండ్రోజుల క్రితం ప్రాజెక్ట్ నీటి మట్టం 1058.10 అడుగుల వద్ద 10.07 టీఎంసీల నీటి నిల్వను చూపిన అధికారులు సోమవారం అదే నీటి మట్టం వద్ద 6.37 టీఎంసీల నీటి నిల్వను చూపారు. దీంతో ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణిని సంప్రదించగా 2021–22 సంవత్సరంలో ప్రాజెక్ట్‌లో పూడిక సర్వేను నిర్వహించిన బెంగళూర్‌కు చెందిన సీకాన్ సంస్థ సర్వే బృందం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు పడిపోయినట్లు తేల్చిందన్నారు. ఈమేరకు ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) కార్యాలయ జనరల్ అధికారులు రెండ్రోజుల క్రితం ధ్రువీకరించారని తెలిపారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను 112 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. 1978లో నేషనల్ హైడ్రో గ్రాఫిక్ సర్వే ప్రకారం 112 టీఎంసీల నిల్వ ఉంది. తరువాత 1994లో ఏపీఈఆర్ఎల్ (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ లేబరేటీస్) బృందం నిర్వహించిన సర్వేలో ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలకు పడిపోయినట్లు తేల్చారు. అప్పటి నుంచి ప్రాజెక్ట్ నీటి మట్టం 1091 అడుగులకు 90 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్ట్ అధికారులు లెక్క గడుతున్నారు. తరువాత అనేక సర్వే బృందాలు చేపట్టిన సర్వేలో ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం భారీగా తగ్గినట్లు నివేదిక ఇచ్చారు. అయితే ప్రాజెక్ట్ అధికారులు కొట్టి పారేశారు. ప్రస్తుతం సీకాన్ సంస్థ ఇచ్చిన నివేదికను ధ్రువీకరించారు. ప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం దాదాపుగా 10 టీఎంసీలు తగ్గింది. నిర్మాణ కాలం నుంచి ఇప్పటి వరకు లెక్క చూస్తే 32 టీఎంసీల సామర్థ్యం తగ్గింది. దీంతో ప్రాజెక్ట్ ఆయకట్టుపై ప్రభావం పడే అవకాశం ఉంది.

ఆందోళనలో ఆయకట్టు రైతులు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం రోజు రోజుకు తగ్గుముఖం పట్టడం పై ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ ఆధారంగా 18 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుంది. 10 టీఎంసీలు నీరు తగ్గడం అంటే లక్ష ఎకరాలపై ప్రభావం చూపుతుందని ప్రాజెక్ట్ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. ప్రాజెక్ట్‌లో పూడిక తొలగించాలని రైతులు కోరుతున్నారు

కౌంటింగ్‌కు భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లిలోని సీఎంసీ కాలేజీలో మంగళవారం నిర్వహించనున్న నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 700 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీపీ కల్మేశ్వర్ పర్యవేక్షణలో ఇద్దరు డీసీపీలు, 10 మంది ఏసీపీలు, 70 మంది ఎస్సైలు, 600 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీఎంలను గోదాంను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



బందోబస్తులో పాల్గొననున్న పోలీసులు


నేడు మద్యం దుకాణాలు బంద్

కౌంటింగ్ సందర్భంగా మంగళవారం జిల్లాలో మద్యం దుకాణాలు మూసి వేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. వైన్ షాపులు, బార్‌లు, కల్లుబట్టీలు తెరువొద్దని చెప్పారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎస్‌వో, డీఎం



డీఎస్‌వో సి పద్మ



డీఎం రాజేందర్

సుభాష్‌నగర్: జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా సి పద్మ, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్‌గా జి రాజేందర్ సోమవారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఎస్‌వో, డీఎంలుగా విధులు నిర్వర్తించిన చంద్రప్రకాష్, జగదీశ్‌కుమార్‌పై ఆ శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసిన విషయం విదితమే. వీరి స్థానంలో డీఎస్‌వోగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో డిప్యుటేషన్‌పై డిప్యూటీ కమిషనర్‌గా కొనసాగుతున్న సి పద్మను నిజామాబాద్ ఇన్‌చార్జి డీఎస్‌వోగా నియమించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సివిల్ సప్లయ్ డీఎంగా కొనసాగుతున్న జి రాజేందర్‌ను నిజామాబాద్ ఇన్‌చార్జి డీఎంగా నియమించారు.

క్లుప్తంగా

అందుబాటులోకి గ్రంథాలయ భవనం



సాక్షి ఎఫెక్ట్..

రుద్రూర్: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన గ్రంథాలయ, ఆరోగ్య ఉప కేంద్రం భవనాలను నిర్లక్ష్యంగా వదిలేశారని పేర్కొంటూ 'సాక్షి'లో గత నెల 20వ తేదీన 'నిర్లక్ష్యానికి తొమ్మిది నెలలు!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై గ్రంథాలయ అధికారులు స్పందించారు. భవన నిర్మాణంలో భాగంగా మిగిలిపోయిన చిన్నచిన్న పనులను పూర్తిచేయించి పాఠకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నూతన ఫర్నిచర్‌ను సరఫరా చేశారు. 31 కుర్చీలు, ఏడు టేబుళ్లు పంపించడంతో పాఠకులు హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో బుధవారం నుంచి ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం కానుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సోమవారం తెలిపారు. మొదటి స్పెల్‌లో సంస్కృతం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, పౌర శాస్త్రము, ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని, మూల్యాంకనంలో పాల్గొనాల్సిన అధ్యాపకులకు ఆయా కళాశాలల లాగిన్లలో నియామక పత్రాలను ఇంటర్‌బోర్డు నిక్షిప్తం చేసిందని పేర్కొన్నారు. మూల్యాంకన విధులు కేటాయించిన అధ్యాపకులను ప్రిన్సిపాళ్లు మంగళవారం రిలీవ్ చేయాలని ఆదేశించారు. మూల్యాంకన విధుల కోసం అధ్యాపకులను రిలీవ్ చేయని ప్రిన్సిపాళ్లపై అలాగే రిలీవ్ అయినప్పటికీ మూల్యాంకనానికి హాజరుకాని అధ్యాపకులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మూల్యాంకన విధులకు హాజరుకాని అధ్యాపకులకు ఇంటర్‌బోర్డు గతంలో జరిమానాలు విధించిందన్నారు. రెండో స్పెల్ 7వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, బొటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ మూల్యాంకనం ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్

ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జనరల్, ఒకేషనల్ అన్ని సబ్జెక్టుల ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 4 నుంచి ప్రారంభమవుతాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ ఉంటాయని, ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

కొల్‌పూర్ టు బద్రీనాథ్

- 1900 కిలోమీటర్ల పాదయాత్ర
- 70 రోజులపాటు కొనసాగిన నడక




బద్రీనాథ్ ఆలయం వద్ద పాదయాత్ర బృందం



రాత్రి వేళలో పాదయాత్ర చేస్తున్న భూమయోగేశ్వర ఆశ్రమ సభ్యులు

నందిపేట్(ఆర్మూర్): నదులు, గుట్టలు, అడవులు దాటుకుంటూ హిందువులు ఎంతో పవిత్రంగా భావించే బద్రీనాథ్ క్షేత్రానికి నందిపేట్ మండలం కొల్‌పూర్ గ్రామంలోని భూమయోగేశ్వర ఆశ్రమ సభ్యులు పాదయాత్ర చేశారు. 1900 కిలోమీటర్ల పాదయాత్రను 70రోజుల్లో పూర్తిచేసి బద్రీనాథుని చెంతకు ఆదివారం చేరుకొని స్వామివారిని సోమవారం దర్శించుకున్నారు. కొల్‌పూర్‌లోని భూమయోగేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు చింత రమేశ్‌స్వామి, రూపదేవి దంపతుల ఆధ్వర్యంలో శిష్యబృందంలోని సభ్యులు సత్యం, వాల్మీకి, నర్సయ్య, రాజేశ్వర్, పార్థసారథి, లక్ష్మీనారాయణ, సుధాకర్ మార్చి 24 పౌర్ణమి రోజున లోకకళ్యాణార్థం కొల్‌పూర్ నుంచి బద్రీనాథ్‌కు పాదయాత్రను ప్రారంభించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఉత్తరాఖండ్‌లోని గర్వాల్‌కొండల్లోని బద్రీనాథ్ క్షేత్రానికి చేరుకున్నారు. మార్గమధ్యలో పుణ్యక్షేత్రాలు, ఆశ్రమాలను సందర్శించి సాధుసంతుల ఆశీస్సులు తీసుకుంటూ ముందుకుసాగారు. కొన్నిచోట్ల అడవి జంతువులు, క్రూరమృగాలు ఎదురువచ్చినా ఆ బద్రీనాథుడిని తలుచుకుంటూ పాదయాత్రను కొనసాగించారు. హిమాలయ పర్వతాలలోని బద్రీనాథ్ చేరుకున్నారు. పాదయాత్ర మార్గమధ్యలో వివిధ ప్రాంతాల నాగరికతను తెలుసుకుంటూ ప్రాంత వాసుల పరిచయాలు, సాధు సంతుల ఆశీస్సులు తీసుకుంటూ కొనసాగించారు. రేయింబవళ్లు నదులు, గుట్టలు, అడవులను దాటుకుంటూ పాదయాత్రను కొనసాగించారు. బద్రీనాథుని దర్శనం తరువాత కేదర్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి దర్శనానికి బయల్దేరనున్నట్లు చింత రమేశ్‌గురుస్వామి తెలిపారు.

లోకకల్యాణార్థం..



లోకకల్యాణార్థం కొల్‌పూర్ నుంచి బద్రీనాథ్‌కు పాదయాత్ర చేశాం. గతంలో ఆశ్రమం నుంచి మహారాష్ట్రలోని పండరీపూర్, మన రాష్ట్రంలోని వేములవాడ, ధర్మపురికి పాదయాత్ర చేశాం. బద్రీనాథుని ఆశీస్సులతో దిగ్విజయంగా సుదీర్ఘ పాదయాత్రను పూర్తి చేసుకొని స్వామి చెంతకు చేరుకున్నాం.

– చింత రమేశ్‌స్వామి, భూమయోగేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు

జన్మ సార్థకమైంది



కొల్‌పూర్ ఆశ్రమం నుంచి బద్రీనాథ్ వరకు సుదీర్ఘ పాదయాత్ర చేయడం ఎన్నో జన్మల పుణ్యఫలం. ఈ పాదయాత్రతో జన్మసార్థమైంది. పాదయాత్ర ద్వారా దేశ నాగరికత, విభిన్న ప్రాంతాల ప్రజల అలవాట్లు తెలుసుకున్నాం. అడవులు, నదులు, కొండలు, గుట్టలు దాటుకుంటూ కొనసాగిన పాదయాత్ర మరిచిపోలేని అనుభూతినిచ్చింది.

– సత్యం, ఆశ్రమకమిటీ సభ్యుడు, కొల్‌పూర్



● ధన్యవాద్ భారత్

దేశ ప్రజలకు భారత ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై యువకులు సోమవారం సంతకాలు చేశారు. ఈ పవిత్రమైన క్షణమే సరైన సమయమని, వెయ్యేళ్ల భారత్ భవిష్యత్‌కు పునాది వేస్తామంటూ యువకులు నినాదాలు చేశారు. కార్పొరేటర్ సుధీర్, సుధా, భగత్, సాయితోపాటు రోడ్డుపై వెళ్లే యువకులు సంతకాలు చేశారు. – సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అక్రమ కేసులతో కక్ష సాధింపు

- నా కుటుంబ సభ్యులను అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశించింది
- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో తనకు చెందిన 76 ఎకరాల భూమిపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య రజితారెడ్డి, అమ్మ రాజుబాయితోపాటు ఇతర కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. తన కుటుంబ సభ్యులను అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశించిందని, తనపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయాలనుకున్న కాంగ్రెస్ ఆశ నెరవేరలేదని పేర్కొన్నారు.

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

డిచ్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లకు డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో సోమవారం సాయంత్రం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి టి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటాపోటీ ఉంటుందని, నిర్లక్ష్యంగా ఉండొద్దని, పూర్తి ఫలితం వెలువడే వరకు అప్రమత్తంగా ఉండాలని ఏజెంట్లకు సూచించారు. ఈవీఎం ఓట్లకు, 17సీ ఓట్లకు తేడా వస్తే వెంటనే అక్కడే ఉన్న ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత, పీసీసీ ప్రధాన కార్యదర్శి కే నగేశ్‌రెడ్డి, ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, ముప్ప గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మానాల మోహన్‌రెడ్డి పుస్తక రూపంలో ముద్రించిన తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ గేయం పుస్తకాలను గ్రామగ్రామాన పంపిణీ చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని మహేశ్‌కుమార్‌గౌడ్, జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

రెండోసారి బీజేపీదే విజయం



మాట్లాడుతున్న అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రెండోసారి బీజేపీ గెలవబోతోందని, అయినప్పటికీ కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. సోమవారం నగర శివారులోని భారతి గార్డెన్‌లో కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్వింద్ ధర్మపురి మాట్లాడుతూ.. పూర్తి స్థాయి ఫలితం వెలువడే వరకు ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఈవీఎం ఓట్లకు, 17 సీ ఓట్లలో తేడా ఉంటే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, సత్యనారాయణ, సీనియర్ నాయకుడు లోక భూపతి రెడ్డి, నియోజకవర్గ నాయకులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, మోహన్‌రెడ్డి, బద్దం లింగారెడ్డి, గద్దె భూమన్న, న్యాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోవాలి

ఓట్ల లెక్కింపు సందర్భంగా డిచ్‌పల్లి సీఎంసీ వద్ద గొడవలు, అల్లర్లు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేశ్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షపార్టీలు కౌంటింగ్ సజావుగా జరగకుండా గొడవలు సృష్టించే అవకాశం ఉందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

సిబ్బందికి విధుల కేటాయింపు



హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): పార్లమెంట్ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసు సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి విధులను కేటాయించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సుమారు 700 మందికి పైగా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సెంటర్ ముందు నుంచి 44వ నంబరు జాతీయరహదారి ఉండటంతో పోలీసులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ పర్యవేక్షణలో ఇద్దరు డీసీపీలు, 10 మంది ఏసీపీలు, 20 సీఐలు, 70 మంది ఎస్సైలు, 30 మంది ఏఎస్సైలు, 120 హెడ్‌కానిస్టేబుళ్లు, 300 కానిస్టేబుళ్లు, 70 మహిళ కానిస్టేబుళ్లు, 110 హోంగార్డులు బందోబస్తులలో పాల్గొననున్నట్లు వివరించారు.

కారు బీభత్సం

- కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లిన వాహనం
- ముగ్గురికి తీవ్రగాయాలు, నాలుగు బైక్‌లు ధ్వంసం
- ముబారక్‌నగర్‌లో ఘటన



కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

నిజామాబాద్‌రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముబారక్‌నగర్ ప్రాంతంలో కూరగాయల దుకాణంలోకి కారు దూసుకెళ్లింది. సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి మద్యం సేవించి కారు నడపడంతో ఈ ఘటన చోటు చేసుకుందని, ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, నాలుగు బైక్‌లు ధ్వంసమయ్యాయని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా కారు డ్రైవ్ చేసిన శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నిందితుడు కారు వదిలి పరారయ్యాడన్నారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా.. మంగళవారం వివరాలు వెల్లడిస్తామని రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు.

రద్దీ ప్రాంతం..

ముబారక్‌నగర్ ప్రాంతంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొందరు వాహనాలను నిర్లక్ష్యంగా నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

రుద్రూర్: మండల కేంద్రంలోని చెరువు కట్ట సమీపంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. మహ్మద్ మక్బుల్ తన పాడిగేదెకు సోమవారం నీళ్లు తాగించి తీసుకువస్తుండగా ఎర్త్ వైర్ తగిలి షాక్‌కు గురైంది. అకస్మాత్తుగా పడిపోయిన గేదెను లేపేందుకు వెళ్లిన మక్బుల్‌కు సైతం షాక్ తగలడంతో వెంటనే విద్యుత్ అధికారులకు ఫోన్ చేశాడు. మృతి చెందిన గేదె విలువ రూ.70వేల వరకు ఉంటుందని, విద్యుత్ అధికారులు తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

బోర్గాం(పి)శివారులో..

మోపాల్: నగరంలోని శివారులోని బోర్గాం(పి)లో విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన నగేశ్ గేదె సోమవారం మేతకు వెళ్లి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలను తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. పాల వ్యాపారం కోసం 15రోజుల క్రితం రూ.80వేలకు గేదెను కొనుగోలు చేశానని బాధితుడు నగేశ్ తెలిపాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి ప్రమోద్‌కుమార్ పంచనామ నిర్వహించారు.

బస్సులో నుంచి పడి ఒకరికి గాయాలు



వర్ని: మండల కేంద్రంలోని పాత వర్ని క్రాస్ రోడ్ వద్ద బస్సులో నుంచి పడి బాన్సువాడకు చెందిన నిమ్మలవార్ రాజు (28) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం బాన్సువాడ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న బస్సులో రాజు ప్రయాణిస్తున్నాడు. పాత వర్ని బస్టాప్ వద్ద దిగుతుండగా బస్సు ముందుకు కదలడంతో రాజు కింద పడిపోగా కాళ్లపై నుంచి బస్సు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు వర్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

రౌడీ షీటర్ రిమాండ్

నవీపేట: మండలకేంద్రానికి చెందిన రౌడీ షీటర్ షేక్ సలీంను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నవీపేటకు చెందిన సాయికుమార్ ఫోన్‌ను షేక్ సలీం నెలరోజుల కిందట బలవంతంగా లాక్కున్నాడన్నారు. ఫోన్ తిరిగి ఇవ్వాలని సాయికుమార్ పలుమార్లు అడిగినప్పటికీ షేక్‌సలీం నిరాకరించాడు. రెండు రోజులక్రితం మళ్లీ ఫోన్ కావాలని అడగడంతో సాయికుమార్‌పై సలీం కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లలో తనిఖీలు



నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లను వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రులు, ప్రథమ చికిత్స కేంద్రాల అనుమతులను పరిశీలించారు. పూర్తిస్థాయిలో పక్కా జాబితాను సిద్ధం చేసేందుకు తనిఖీలు చేపడుతున్నారు. వారం రోజుల పాటు తనిఖీలు కొనసాగుతాయని జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్ తెలిపారు.

పట్టామార్పిడి చేయలేదని ఆత్మహత్య



మలావత్ కేవుల(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆస్తి పంపకాల్లో భాగంగా తనకు వచ్చిన భూమిని తన అన్న పట్టా చేయకపోవడంతో నాగిరెడ్డిపేట మండలంలోని ఎర్రకుంటతండాకు చెందిన మలావత్ కేవుల (36) ఆదివారం కల్లులో విషయం కలుపుకుని తాగాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కేవుల తన ముగ్గురు సోదరులతో కలిసి ఇదివరకే భూమిని పంచుకున్నాడు. ప్రస్తుతం ఎవరి భూమిని వారే సాగు చేసుకుంటుండగా, కేవుల భూమి మాత్రం అన్నాదమ్ముళ్లలో పెద్దవాడైన సక్కు పేరుమీదే ఉంది. దీంతో తన పేరుపై పట్టా మార్చాలని కేవుల పలుమార్లు సక్కును అడగగా ఆయన దాటవేస్తూ వచ్చాడు. తన పేరిట పట్టా చేస్తాడో, లేదోననే బెంగతో కేవుల కల్లులో విషం కలుపుకొని తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న కేవులను గమనించి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఉమేశ్ తెలిపారు.

ఆర్థిక సమస్యలతో..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ గ్రామానికి చెందిన ఊరటి రాములు(40) ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై రాజేశ్వర్ తెలిపారు. అప్పులు కావడంతోపాటు ఆర్థిక సమస్యలు ఎక్కువకావడంతో జీవితంపై విరక్తి చెందిన రాములు ఉరేసుకున్నాడన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి ఒకరి మృతి



రాంబోయి మృతదేహం

బిచ్కుంద(జుక్కల్): ఇటుక ట్రాక్టర్ పైనుంచి జారిపడి మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన రాంబోయి(40) ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. జగనాథ్‌పల్లి వద్ద ఉన్న ఇటుక బట్టీ నుంచి ఇటుకలు తీసుకెళ్లి అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా రాంబోయి ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్నాడు. ఎదురుగా బైక్ రావడంతో ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో రాంబోయి కిందపడిపోగా టైరు తగిలి తీవ్రగాయాలపాలయ్యాడు. రాంబోయిని వెంట ఉన్న వారు ఆయనను ఇంటికి తీసుకెళ్లి వదిలేశారు. కుటుంబ సభ్యులు చూడగా రాంబోయి అప్పటికే మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డెయిరీ ఫారం గుట్టపైన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై మొగులయ్య సోమవారం తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని అన్నారు.


సెక్యూరిటీ సిబ్బందిపై కార్పొరేటర్ భర్త దాడి

- మార్కెట్ యార్డులో మద్యం తాగొద్దన్నందుకు..
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ సిబ్బందిపై 16వ డివిజన్ కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక భర్త పంచరెడ్డి శ్రీధర్ తన అనుచరులతో కలిసి దాడి చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. యార్డులో మద్యం సేవించొద్దని, ఇప్పటికే ఆలస్యమైందని, వెళ్లిపోవాలని సూచించడంతో మే 31న రాత్రి 11.40 గంటలకు సుమారు 15 మంది కలిసి ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనపై వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి నవీన్‌కుమార్, వై సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీలో 42 మంది సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారని, యార్డులో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బంది పగలు, రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. చాలామంది ఆకతాయిలు సెక్యూరిటీ కళ్లుగప్పి లోనికి ప్రవేశించి నిత్యం మద్యం సేవిస్తుంటారన్నారు.

గతనెల 31న కార్పొరేటర్ భర్త పంచరెడ్డి శ్రీధర్‌తోపాటు 15 మంది మద్యం సేవిస్తుండగా.. విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వై సందీప్, ఎస్ లక్ష్మణ్ త్వరగా వెళ్లిపోవాలని సూచించడంతో వారిపై దాడి చేశారన్నారు. దాడిలో సందీప్‌కు తీవ్రగాయాలు కాగా ఎస్ లక్ష్మణ్‌కు స్వల్పగాయాలయ్యాయని తెలిపారు. గతంలోనూ ఐదారుసార్లు సెక్యూరిటీపై దాడులు జరిగాయని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సెక్యూరిటీపై దాడి చేసిన పంచరెడ్డి శ్రీధర్‌తోపాటు మిగతా వారిపై చర్యలు తీసుకోకపోతే ఈ విషయాన్ని రాష్ట్ర సంఘంతో చర్చించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కాగా ఈ ఘటనపై మార్కెట్ కమిటీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రైళ్లలో చోరీకి పాల్పడిన ఒకరి అరెస్ట్



ఖలీల్‌వాడి: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్‌కు చెందిన గంగుల శ్రీధర్ నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అతడి వద్ద నుంచి రెండు లాప్‌టాప్‌లతోపాటు ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మే 29, ఈనెల 1వ తేదీన రైళ్లలో ప్రయాణిస్తున్న వారి బ్యాగులను శ్రీధర్ చోరీ చేశానని, తాను దొంగిలించిన ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌ను హైదరాబాద్‌లో అమ్మడానికి వెళ్తున్నానని అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు. హన్మాండ్లు, కుబేర్ రవికుమార్, గురుదాస్ సేన నాయక్, మణికిరణ్, రాములు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లింక్‌లు ఓపెన్ చేయొద్దు

ఖలీల్‌వాడి: ఎన్నికల ఫలితాల పేరుతో ఆన్‌లైన్‌లో వచ్చే పీడీఎఫ్‌లు, లింక్‌లు ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. లింక్‌లను ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాల వివరాలు సైబర్‌నేరగాళ్ల చేతికి వెళ్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ మోసపోవద్దని సూచించారు.